# రైతు కూతురు

రచన :
శ్రీమతి. పఠానేని శ్రీశైల భ్రమరాంబ

"ఏమే నరసమ్మా! నీకొడుకూ కోడలు మళ్లీ నీ దగ్గరకే వచ్చేశారేం? ఎక్కడో గొప్పనాయుడు గారిదగ్గర పనికి వెళ్లిపోయాడని చెప్పేదానవుకదూ?" అనడిగింది కామేశ్వరమ్మ.

"అదేంటండమ్మగారూ! ఒల్లొంచి పనిచేసుకునే వోళ్లకి కూడికి ఏంలోటు తల్లీ! ఎక్కడో ఓ సోటు పని సూసుకుంటాడు గానండి అయన కాడికి మాత్తరం ఈ జల్మలో ఎల్లడండి మావోడు. ఆడు ఎత్తానన్నా మాసత్తి మాత్తరం సచ్చినా వొప్పుకోదండి" అంది.

"అదేమిటే వాళ్లు వెళ్లిపొమ్మన్నారా? వీళ్లే వచ్చేశారా? అసలేంజరిగిందో చెప్పు?" అంటూ తనుకూర్చుని నరసమ్మనుకూడ కూర్చోమంది అంత వివరంగా చెప్పమన్నట్లుగా.

"మాఓడికి నూరురూపాయిల నగలతో వున్న పిల్లనీ, ఇంకా ఏదో కొంప గోడీ ఇత్తామని తెగొచ్చేవోళ్లండి పెళ్లి చేసుకోమంటూ, అప్పడు మీరైతుకూతురుని మావోడు సూసుకుని మురిసిపోయి" ఒవే అమ్మా! ఒక నూరురూపాయల కట్నం, ఒందరూపాయిల ఒత్తువులు తెత్తే నిండి పోతాదా? మన అదురుటం బాగుండాలి గాని. అదురుట్టం లేకపోతే కోడలు వెయ్యిరూపాయిలు ఒత్తువులతో వచ్చినా మనింట్లో అడుగెట్టే సరికి బగ్గున మండిపోయి అన్నానికి మొఖం వాత్తాం. కావేసిరమ్మగోరి కూతురు సత్తిశానా బాగుందమ్మా! "అని భిడిపడి సెప్పేశాడుండి. అప్పుడునేనే ఎల్లసూసి వొచ్చా, పిల్ల మా లచ్చిమిలా వుంది. మావోడి జల్మ పావనం అయిపోతాది. అనుకొన్నానండి మనసులో. ఆచిన్నదాని తండిరితో మాట్టాడేశా.

"ఒవే లప్పా, నేనేమీ పెట్టలేనోణ్ణి. నీకొడుక్కి శానామంది ఒత్తున్నారు. మరి లేనోళ్లపిల్లన్ని సేసుకుంటావా? అన్నాడండి"

అయితే ఏం? డబ్బుతో లెక్కేంటి? మావోడు నీ కూతుర్ని సూసిన కాణ్ణుంచి సత్తిని పెళ్లాడతానన్నాడు. సరేననెయ్యి. నాకు ఒక్కడే కొడుకు నీకూ ఒక్కరిత్తే కూతురు. దానికి తల్లిలేదు. మావోడికి త్రండ్రిలేడు, ఆళ్లిద్దరికీ మక్కువయినప్పుడు మనం అడ్డం సెప్పడం ఎందుకులే తమ్ముడూ!" అనడంతో ఎగిరి గంతేసి ఒప్పేసుకున్నాడుండి. ఆడి కూతురు సత్తి మునిముసి నవ్వులు నవ్వుకుంటూ ఎల్లిపోనాది.

పెళ్లిమాగనంగా శాశాంలేండి. అప్పుడు మావోడికి పెళ్లిసేస్తున్నామని వరతమానం పంపించామండి నాయుడు గోరికి-మాముసిలోడు బతికున్నంత కాలం అరిదగ్గరే వెగసాయం సేత్తూండేవోడు. ఆతరువాత ఈ ఊరొచ్చేశా ముండి, మారాజుతండ్రి నాయుడు గోరంటే. ఆయన గోరికి మా బగితి. పొద్దత్తమానం బఱినేలు, సదువుకోడం, పాడుకోవడ మున్నూ వుండేవి. ఆయనగోరిమాటంటే అడుగు దాటే వోళ్లెవరూలేరు ఆఊరి మొత్తంలో, ఆరోజుల్లో మమ్మల్నికన్న తండిరి లాగా కాపాడేవోరు నాయుడుగోరు. మావోడు పుటినప్పుడు మాసంబర పడిపోయేరు. అప్పటికి ఆరికి ఓ కొమారుడు గోరుండేవోరు. మావోడి కంటే ఆరబ్బాయి నాలుగేళ్లు పెద్దోరు. ఇన్నేళ్లకి మావోడు పెళ్లి అని కబురు తెలవంగానే ఆయనగోరు ఎండిపొన్ను కర్రసేత బట్టుకుని, పెద్దరయితుని ఎంటబెట్టుకొని, పాలేరు సేత పెట్టి పట్టించుకుని తిన్నగా పెళ్లిపందిరి కాడికే వచ్చేసోరు. పెళ్లికొడుకుని, పెళ్లికూతురిని నాయుడు గోరి దగ్గిరికి తీసుకెళ్లి దణ్ణాలు పెట్టించేము. మావోడికి మంచిలి చాపు, కోడలికి సీరరయికులగుడ్డ పసుపు కుంకం ఇచ్చి దీవించారండి.

"నాయుడుగోరూ! ఇదంతా తమ సేతి సలవేనండి" అని యినయంగా దణ్ణపెట్టా.

"ఒసే నరిసీ! మునుపుమీరు ఎల్లాగైతే వుండేవాళ్లో ఇప్పుడూ అయిధంగానే యుండండి, ఇంకో నాలుగు బత్తాలు గింజలు ఎక్కువే ఇత్తూంటా. ఇక్కడంతా పూరితి అయ్యాక మీముగ్గురూ వచ్చి మాపొలంలోనే కాపురం యుండండి," అని సెప్పి వెళ్లి పోయారండి,

నాయుడుగారి మాటంటే మళ్లీ తిరుగుండదండి, అంతా కర్రెట్టుమాట. "సిత్తం బాబయ్యా" అనినేనూ మావోడు అన్నామండి.

ఓ రోజుని ముగ్గురం కలిసి నాయుడుగోరి ఊరు ఎల్లామండి, మమ్మల్ని సూడంగానే ఆరి అబ్బాయిగారిని పిలిసి, "అబ్బాయీ! యీళ్లకి పొలంలో సాలోవుండ డానికి ఏర్పాట్లు సెయ్యి అన్నారుండి.

"అక్కడెందుకులే నాన్నా! మనతోటలో చిన్ని యింట్లో యుండమందాం, అక్కడ చెట్లకి నీళ్ల అవీ పోత్తూ జాగరత్తగాసూత్తాంటారు, వాళ్ల చాలా నమ్మకస్తులని చెప్పావుకదా! "అంటూ మా ముగ్గురివైపు నవ్వుతూ సూశారు.

తోటలోవున్న సన్న పెంకుటింట్లో మమ్మలిని ఫెవేశపెట్టి మాసంగతి సందరబాలు అన్నీ తెలుసుకుని నాయుడు గోరి అబ్బాయిగారు ఎల్లిపోయారు.

ఆ సాయింతరం నాయుడుగారు తోట్లోకొచ్చి మేం సెయ్యాలసిన పనులు పురమాయించి, పొద్దున్నే పొలం రమ్మన్నారు మా ఓడిని. సీకటి పడ్డాక నాయుడుగారి అబ్బాయిగారువచ్చి, తోటలో పనంతా ఆయన సెప్పినట్టుగా సెయ్యాలని సెప్పెల్లారు.

పొద్దున్నే మా ఓడు చల్దికూడుతిని పొలం ఎల్లిపోనాడు. నేనుపొయి మీద ఎసరెట్టి వాకిట్లో కూసుని సత్తీ నేనూ ఊసులాడు కుంటున్నాం. నాయుడుగారి బూమి, బుట్ర, పశువులు, పెంకుటిల్లు, సిరీ, సంపదా ఏసీయయ్యమంటున్నాయని సత్తికి సెప్పుతుండగానే నాయుడు గారబ్బాయి వచ్చారు.

"సత్తీ! ఇయ్యాల ఏం ఒండు కుంటున్నారు అన్నంలోకి "అనడిగారు, మా సత్తి సిగ్గుపడి ఇంటోకి ఎల్లిపోతే "ఏదో ఇయ్యాలకి ఒర్ర ఏసుకు తినేత్తాం అబ్బాయిగారూ!" అన్నానండి.

ఇంకోగంటకల్లా నాయుడుగారి అబ్బాయి సేహితు లంట ఆరొచ్చారు. ఆరూ ఈరూ మాట్లాడుకొని కొంచెంసేపటికి ఓ కోడిని సంపితెచ్చి ఇచ్చారు.

"ఇప్పు డిదెందుకు బాబూ! ఇంతపెద్ద పెట్టనీ మాకెందుకు? మీరు పట్టించు కెల్లండి, ఇందులోకి ఎయ్యడానికి మషాళా సరుకులు మాదగ్గిరలేవండి" అనేశా.

"కోడి మాంసంలో అన్నీపోతే మిగిలేది తక్కువే కదుటే. పేగులు, తిత్తులు, దబ్బ, కొండనాలిక, అంతా బాగుచేసి ఒండుకొంటే మీ ముగ్గురూ తృప్తిగా తినొచ్చు' అని చెప్పేసి ఆయన ఎల్లిపోయిన కొంచెం సేపటికి ఆరిసేహితులువచ్చి అందులోకి తాలింపు సరుకులు, నూని అన్నీతెచ్చి ఇచ్చి ఎల్లారు. ఇంకా ఏమైనా మషాలా సరుకులు కావాలంటే తెచ్చుకోమని ఒకరూపాయి కూడా ఇచ్చారు నాయుడుగా రబ్బాయి.

ఆ సాయింతరం తోటలో ఏదో పాదుకు సెయ్యాలని గడ్డితుక్కు మొక్కలు లేకుండా బాగు సెయ్యమని సెప్పి నేనూ, సత్తీ పని సేతోంటే అబ్బాయిగారు ఆరిసేహితులు దగ్గిరుండి సేయించు కొన్నారండి మాసేత.

ఆమన్నాడు పొద్దున్నే మావోడు పొలం ఎల్లిపోయాక అర్ధశేరు మేక మాంసం, అందులోకి మషాలా తాలింపు సరుకులు, ఒకరూపాయిఇచ్చి ఎల్లారు ఆరిసేహితులు," ఎందుకండీ బాబుగారూ! నిన్న నాలుగు రూపాయిల ఖరీదైన కోడిని ఇచ్చారు. ఇయ్యాల రూపాయిన్నర ఖరీదు ఈ మాంసం. పైగా ఇంకో రెండు రూపాయిలు కూడా ఇచ్చారు, మాలాటి ఓళ్లకి ఇంత ఇలవైనవి ఎందుకండీ?" అనడిగా.

అంతలో నాయుడుగా రబ్బాయిగారువచ్చి "మాకీ మాత్తరం ఏం లెక్కలేదు, ఎంత మందైనా మాయింటికివచ్చితిని పోతూంటారు. కష్టపడి చెమటలూడ్చి పనిచేసే మీకీమాత్రం ఇస్తే మాకేమీ లోటురాదు తీసుకో" అనడంతో మళ్లీ నోరెత్తకుండా ఇంటోకి తెచ్చిహోయిగా వొండుకు తిన్నామండి.

ఆరాతిరి మావోడు ఇంటికొచ్చాక "ఎందుకు పుచ్చుకొన్నావమ్మా" అనడిగాడండి. "ఆరు, ఆరిసేహితులు బలమంతంసేసి సెప్పుతూంటే తప్పుగాదంట్రా? ఎగుంటేగాని తిట్టరు; భతికివుంటే కాని పెట్టరు; ఆరిపని మనం నడ్డొంచి సెయ్యాలి. ఆరుమనకి కడుపునిండా పెట్టాలి" అనినేను అనడంతో ఇంక ఊరుకున్నాడు మావోడు.

ఓరోజు "కలగతరు పరిగిలు" తెచ్చిచ్చారు నాయుడు గారబ్బాయి, అవి సూసినేను "ఇవిమాకెందుకుబాబూ! ఎవరైనా అధికారులు, గొప్పింటివారు, జమీందారులుకి ప్రెచ్చేకంకాని మాలాంటి బీదోళ్లు అయిదు రూపాయి లిచ్చి కలగతరు పరిగిలుకొనుక్కో గలరాండి?" అన్నానండి. "తీసుకోవే! పెద్ద చెరువులో పట్టించి తెప్పించాను అని ఇచ్చేసి ఎల్లిపోయారండి ఆరంతా కలిసి,

ఆరోజుని సత్తి మావోడు సరసని కూసుని వణ్ణం తింటూ సరసాలాడు కొంటూంటే మాహ ముచ్చటే సిందండి, మాకోడలు మాపెద్దా అందమైందండి, దాన్ని సూత్తే మైనంగోరు వంక సిగ్గు పడాలి, తళతళలాడీ ఒళ్లూ, వేత రావాకులాంటి అరసేతులు, సెంగలువు కాడలాంటి సేతులు, సెందురూడి లాంటి మొగమూ నగి చత్రాల్లాంటి పళ్లు, పిల్ల రెపరెపలాడిపోతూ గున్న మాయిడి సెట్టులా మాయిదిగా యుంటుందండి, మావోడు కూడా మాసోకైన మనిసండి, అల్లిద్దరూ రాదా కిట్టుడూ లాగుంటారండి, రాయిచెట్టు యేపచెట్టు లాగ ఇద్దరూ ఒక్క ప్రేనంగా ఉంటారండి, తాడిచెట్టూ నల్లేరు తీగలాగ ఆల్లిద్దరూ ఒకళ్లనొకళ్లు యిడవ కుండా, మా ఆపేచ్చంగా, మోగంగా ఉండే వారు మాకొడుకూ కోడలూ, మావోడు పొలం ఎల్లిన దగ్గరనుంచీ దానికి అత్తమానం ఆడిమీదే ధేనం.

ఓరోజున నాయుడుగారబ్బాయి "పండు గొప్పచేపలు తెచ్చిచ్చారండి," ఇవిశానా ఖరీదండి, అయిదురూపా యిల తక్కువకి చేపరాదండి. ఇప్పుడు మీరు మాకోసం శానా ఖరీదుపెట్టి ఈ చేప లెందుకు తెచ్చారు బాబూ!" అని నేనడంలోనే ఆరు-

"అదేంమాటే! పదిరూపాయలలోపులోనే కాని పెద్ద ఖరీదేంకాదుగా? ఈ పాటి మీరు తినతగరా? మేంపెట్టతగమా?" అనేసి ఎల్లిపోయారు.

ఓరోజున సముద్రంలో పట్టించి తెచ్చానని "వాలచేప' తెచ్చిచ్చారు అబ్బాయిగారు.

అదిసూసి సత్తి శానా అసయ్యించు కొన్నాదుండి," ఒలేలత్తా! మనకు లేకపోతే గంజితాగి పడుందాం. ఏటీ ఇయ్యడాలు? నాకేమీ బాగాలేదు" అంది.

"అదేంటి సత్తీ! ఆరుకి మనమీద అనుగ్రాగం యుండి కనుక ఇల్లా ఇత్తున్నారు. వద్దంటే మనకి కూట్లో మట్టే" అని కొంచెంమందలించానండి, ఇంక ఏమీ అనలేక నోట్లోనే గొణుక్కుంటూ ఎల్లిపోనాదండి.

ఓరోజుని "పులసచేప" తెచ్చిచ్చారండి, అయ్యాళ రాత్తిరి మాఓడుకూడా అడిగినాడుండి "ఎందుకేలమ్మా! నాలుగు రూపాయలు కరీదైన పులసచాపతినే తాగాతు మన కెక్కడుందే?" అన్నాడు.

"అదేంమాటరా? మన అదురుట్టం బావుండి, మన నోట్లో సిరుండబట్టే ఇక్కడకొచ్చి పడ్డాం. దయదలిచి పెట్టేవోరిని వొద్దని సెప్ప డానికి మనమేం గొప్పోళ్లం? ఆరిపాదాలకాడ పడి బతకాలేని, ఆరిని దేవుడుతో సమానంగా సూసుకోవాలి అంటూ మాఓడికి కాత్త గట్టిగా సెప్పేప్పడికి ఇంకేం అనకుండా ఊరుకున్నాడుండి.

ఓరోజు సాయింత్రం నాయుడుగా రబ్బాయి ఆ రిసే గితులువచ్చి ఏదో పాడుకుటండి; అందుకు వరసాగా మొక్కలు పాతాలని గితలుగిసి, ఆ గీటు పొడుగుతా పాతమన్నారుండి. సత్తి నేను ఎల్లిపాతుతూంటే ఆరొచ్చి "ఒరేనరిసీ: నీకు సరిగ్గా వరస తెలీడంలేదు. నువ్వెల్లా వెళ్లి పెద్ద మొక్కలు పాతు నా సేహితులు సూపిత్తారు నేనిక్కడ సత్తిసేత వరసపాతిత్తాను" అని ఆరు సెప్పడంతో మిగతా వారంతానన్ను యంట తీసుకుని కాత్త దూరంబా సివారిగీటు దగ్గరకి తీసుకొచ్చినారండి.

ఆ నాయుడుగారబ్బాయి సత్తిసేత మొక్కలు పాతించే నెంపతో దగ్గిరగా కూసున్నారండి – సత్తి తలొంచుకుని పాతుకుంటూందండి ఆరు సెప్పినట్టు.

"ఏమె సత్తీ! నువ్వూ నిమొగుడూ సుకంగా వుంటు న్నారా?" అనడిగారు అబ్బాయిగారు.

"సిత్తంబాబయ్యా? తమదయవల్ల, మామావ రెక్కలు సల్లగా యుంటే మాకేంలోటండి?" అంది దాని భరతని మనసులోకి తెచ్చుకొంటూ. "నేను నీ కోసం, నీకు సుభరమైన తిండితిని బలంగా వుండాలని చేపలు, మాంసం పంపిత్తున్నా" అన్నాడు గరవంగా.

ఆమాటనేసరికి వులిక్కి పడింది సత్తి. తలఎత్తి అబ్బాయిగారి మొహంలోకి చూసేసరికి ఆయన మొగంలో సిరినవ్వు తాండాలాడుతోంది.

"నువ్వు సూడబోతే రంభలాగుంటావు, ఆడో మొద్దు లాగుంటాడు, ఆణ్ణి సూతే నీ కసాయ్యం ఎయ్యదంటె సత్తీ!" అనడిగారు.

"మామావ నాకళ్లకి సెందురూడులాగ, మనమధూడు లాగ, మాగొప్ప సుందరంగా కనిపిత్తాడండి, ఆడుకంటే లోకంలో మొగోళ్లంతా అసయ్యంగానే వుంటారండి, మామావచాలా అందగాడండి "అంది పులకరించే మధుర బావాలతో సత్తి, "నీ చెంతని నీ మొగుడు నిల్చుంటె ఏమీ బాగుండదే! నువ్వు చాలా అందంగా, అప్ప సరసలా వుంటావు అన్నాడు ఎకిలిగా నవ్వుతూ.

"మా మావని పెళ్లాడ్డానికే నాకింత అంద మిచ్చాడు ఆ భగమంతుడు, మావోడుదగ్గరుంటేనే నాకు అందం కానండి లేకపోతే నేనే బాగుండనండి, నాకంటే మావే అందమైనవోడండి, మా నాజూగ్గా వుంటాడండి మా మావ" అంది మురిసిపోతూ.

"అయితే నేనోటి అడుగుతా సెప్పు? నీ మొగుడు కంటే నేను అందంగా వుంటానా? వాడికంటే నేను గొప్పవాణ్ణినా?" అంటూ మొక్క పాతుతూన్న సత్తి చేతిని ముట్టుకున్నాడు.

సత్తికి తన మానవత్తవాన్ని కత్తితో పొడిచినట్టు అయింది. ఆతన్ని సూత్తే అదివరకున్న గౌరవం పోయి అసయ్య భావం ఏరుపడింది.

"మా మావంత అందగాడు. ఈ లోకంలో ఎవరూ లేరండి. అందరికళ్ళకి ఆడు ఎల్లా కనిపిత్తే నాకెందుకు గానండి నాకు సాలా బాగుంటాడండి, నేను అడి సొత్తు. అడు నాసొంతం, మాయిద్దరి సంగతులు మీలాంటి ఓరికి అనవసర పెసంగం బాబూ!" అంది చీదరించుకున్న మొఖంతో సత్తి.

"నేను కనక ఒప్పుకోకపోతే మానాన్న మిమ్మలిని ఈ తోటలో పెట్టేవారా? నీమీదవుండే మక్కువచేతనే మీకింత సహాయం సేత్తున్నా" అన్నాడు సత్తికి తగిలీ తగలనట్టుగా మొఖం పెట్టి.

"సిత్తం బాబూ! శానా వుపకారం సేత్తున్నారు, మీరు మాకు తండ్రిలాటివోరు, మీమేలు ఈ జలమలో మరిచిపోలేం నాన్నగారూ!" అంది సతి తలవొంచు కునే.

"అదేంమాట సత్తీ! నువ్వు పడుచు గ టవి. నేనూ పడుచువోణ్ణి. నీ మావని ఎల్లా సూసుకుంటున్నావో; నన్నూ అల్లాగే సూసి ఓ కన్నిసురు, ఆ ముసిలిదాన్ని గురించి నువ్వేమీ భయం పడక్కర్లేదు. అది డబ్బుతో లొంగిపోతాది. నీకేమీ లోటు సెయ్యనులే, నువ్వెప్పుడు రమ్మంటె అప్పుడే వత్తా" అంటూ సత్తి భుజంమీద చెయ్యేసేడు ఆయన.

దాంతో ఒళ్ళు కంపరమెత్తి అసాయ్యించుకొంటూ సత్తి లేచినిల్చుంది. ఆయన సెయ్యి తెగిన సంకెల్లలా జారిపోయింది. సత్తి కొంచెం దూరంగా ఎల్లి నిలుచుంది. ఆయనగారుకూడా ఎల్లి సత్తి దగ్గరగా నిల్చొని "సత్తీ! నీ పయసుమీదే నా మనసు, నీ వొంటిమీదే నా సూపు. నీ సేతులు, నీ నడుము, నీ అందం నన్ను కుక్కలా చేసి నీ యింటిసుట్టూ తిప్పిత్తున్నాయి. నేనింతగా ఏ సిన్న దాన్ని బతిమాలలేదే. నీ ముందర నా బలం అంతా నీరయిపోయింది. నువ్వు నా కోరికకి ఇంక అడ్డు సెప్పే వంటే నేను బతకలేనే సత్తీ!" అని లొట్టవేసుకుంటూ అడిగాడు.

"ఏవయ్యోయ్! కొత్త మంచీ మరేదా తెలుసుకుని మరీ మాట్టాడు. నీకు డబ్బుందని మాకేం భయంలేదు, ఇల్లాంటి పోకిరీ మాటలు రానిచ్చావంటే మా మావతో సెప్పి సూడేంచేయిత్తానో" అంటూ ఎర్రబడినమొఖంతో ఖాండ్రించి వుమ్మేత్తూ అరిచింది సత్తి.

"ఏంటే? మహాపతివ్రతలా కబురులు సెప్పుతావ్?" అంటూ అధికార స్వరంతో అనేసి సత్తి నడుం మీదకు సెయ్యేసేడు.

(సశేషం)

# రైతు కూతురు

రచన :
శ్రీమతి. పఠానేని శ్రీశైల భ్రమరాంబ

(గతసంచిక తరువాయి)

ఒక్కసారిగా ఆ సెయ్యి లాగి పారేసింది. తీసేసిన గొళ్ళెంలా ఆడి చెయ్యి వేలాడింది. అల్లాగే నిలుసుండి పోయాడు రాం బొందులా ఆతడు. సత్తి ఒక్కపరుగున మేమందరం వున్న కాడికి వచ్చేసింది దడదడలాడే గుండెలతో. ఆయన నడుం యిరిగిన పాములా బుసలు కొడుతూ ఆ తోటలోనుంచి బయట కెల్లిపోయాడు. సత్తి జరిగిందంతా సెప్పేసరికి ఆయన స్నేహితులుకూడా సల్లగా అక్కణ్ణుంది ఎల్లిపోయారు.

ఆ సాయంతరం మళ్ళీ నాయుడుగోరబ్బాయి ఆరి సేహితులు వచ్చి పెద్దవి "కొయ్యంగ చేపలు" తెచ్చి ఇచ్చారు. అవిసూసి 'ఇదేంటి బాబూ! మా సత్తి ఇయ్యాల శానా కోపంగావుంది. ఈ చాపలు, అందులోనూ రొండు పుంజీల రూపాయల చేపలు పుచ్చుకుంటే నామీధ అగ్గయి పోతాది. పట్టుకుపోబాబూ!" అన్నా భయంతో.

"మరేం ఫరవాలేదులే నరసమ్మా! కొత్త కాబట్టి ఇంత భయంగా వుందే కావి......కొన్నాళ్ళు పోతే అదే రాటుతేరి పోతాదిలే, బాగా ఒండి పెట్టు సత్తికి" అంటూ ఆరు ఎల్లిపోనారు.

అవి ఇంటోకి తెచ్చుకుని సత్తి ఏంచేత్తోందో నిన సూశా గదిలో బోర్లా పడుకునుంది సాపమీద. ఆ చాపలు తెచ్చుకుని చేదుకట్టు తీసుకుని, శంకులు తీసిపారేసి, తోకలు కోసి, ముక్కలు తరుక్కుంటూంటే, సత్తి లేసిన అలికిడి అయింది. గబగబా ఆ ముక్కలు కడుక్కోడానికి పట్టుకు ఎల్లిపోయా నూతి దగ్గరకి. అంతలోకే సత్తి గుమ్మంకాడ మావోడికోసం ఎదురు సూతూ నించుంది. నేనూ లోపలికి రాగానే 'అవేంటి?' అంటూ మహా వ్యాగ్రంగా అడిగేసింది సత్తి.

"ఏం లేవే లేదు" అనేసినానండి బెదురుతూనే.

"ఎదవ ఎంగిలి ముద్దకి ఆశిత్తావాలత్తా? ఆ రాచ్చసుడు, ఆ ఎలుగుబండిగోడు, ఆ దురమారగుడు, ఇచ్చిందేమీ పుచ్చుకు ఇంకనువ్వు ఒండితే మాత్తరం మేంతినం. ఆడు రాభణాసురుడులాంటోడు, ఛీ! ఎదవ!! మంచీ, మరేదా, పాపం, పున్నెంలేని దురంత కాలపోడు. అస రీడి దగ్గర పనికుండడమే బుద్ది తక్కువ. ఛీ! ఎదవ సచ్చినోడు. కుక్కతలోడు దున్నపోతులా మొఖం ఈడూను, దర్మఫెబువులు నాయుడుగోరి కడుపున ఇలాటి సన్నాసి ఎడవ పుట్టేడు. ఛీ! ఈడితల బద్దలవ్వ. ఈడి జివ్య పడిపోను, పారెయ్యి ఎదవ చాపముక్కలు, ఆడి మొఖాన్ని గిరాటెయ్యి." అంటూ మా సెడ్డ కోపంగా నా సేతులో దాక వూళ్లాక్కో బోయిందండి. "ఒలే సత్తీ నీ కిట్టంలేకపోతే మానెయ్యి. నేనే ఒండుకుతింటా" అన్నానండి.

"ఎదవతిండి పంది తిన్నట్టు ఎందుకు? ఇంత దురన్నేయానికి ఒడిగట్టినోడి చేత్తో బంగారమిచ్చినా మన్నులా సూడాలి. ఆడు చెమ్మరాక్షసి కాని మనిషికాడు. ఆడిదీ ఓ జల్మేనా? సెయిందవుడులాటోడు, మావతో సెప్పి ఆడితల బద్దలుకొట్టిత్తా" అంటుంటే; నిజంగా సత్తి అన్నంత పనీ సేసేత్తాదని బయపడిపోయి "సత్తీ ఈపాలికి ఊరుకోవే, నేనే నాయుడు గోరి అబ్బాయికి బుద్దొచ్చేలా చెప్పేత్తాను నామాట ఇనె" అంటూ బతిమిలాడు కొన్నానండి.

మావోడు రాంగానే "సత్తీ! ఇయ్యాల ఇల్లాగున్నావేం?" అని అడిగాడండి.

"మావా! రేపటినుంచి నీతో నేనూవత్తా పొలం. అక్కడ నీతోనే నేనూ చేత్తూంటా పని. నీకు సాహితాగానూ వుంటా. నాకు ఊసూపోతుంది." అందండి సత్తి,

"నువ్వు కట్టపడ్తూంటే నే సూళ్లేనే సత్తీ! నువ్వు ఎండలో పనిసేత్తే నీ అందం తరిగిపోతాది. నువ్వు ఏ మారాజుల ఇంటోనో పుట్టోల్సిన మారాజు కొమారి లాటి సుకుమారం దానవి. నా అదురుట్టంచేత మా కులంలో వుట్టావు సత్తీ" అంటూ దగ్గిరగా తీసుకుని పేమగా మొఖంలోకి సూత్తూంటే పొంగిపోనాదండి సత్తి.

"అదికాదు మావా! ఆ నాయుడుగోరి కొడుకు, ఆడికి సేగితులు దురిబోదనుడికి దురిశాసనుడు, కరునూడు లాంటోళ్లు, రాబణాసురుడికి కుంబకరుణుడులాంటి అద్దాం తరపు సచ్చినోళ్లు, పదిమంది పిచ్చకుక్కల్లాంటివోళ్లని ఎంటేసుకుని ఈ తోటంతా తిరుగుతారు మావా. ఆళ్లు సేటుకాలపు అద్దాంతరం సచ్చినోళ్లు. ఆళ్లకి తండిరని లేదు, భయమనిలేదు, భగితనిలేదు, మణుసుల రగతాన్ని తాగే పిశాచాలు, రాచ్చసులు ఆడూ ఆడి సేగితులుకూడా. నాకిక్కడ వుండాలనిలేదు మావా" అంటూ సత్తి మా వోడి పీకకి రెండుసేతులూ సుట్టేసి గట్టిగా సెప్పిందండి.

"మాయమ్మ వుంది కదంటే? ఇంక నీకు బయం లేదులే" అనేశాడండి మావోడు.

రాతిరి వొన్నాలుపెట్టుకున్నామండి. సరిగ్గా చాపల కూర యయ్యిబోనానండి," ఆకూర ఏత్తే అసలియ్యాల అన్నం ముట్టుకోం. ఆ ఎదవకూర తినకపోతే పేనం పోదులే, మావా! ఆకూర వేసుకోకు. నే నొద్దన్నా బల వొంతంగా వొండింది. నువ్వు సెయ్యేసి ముట్టుకోకు ఆ సేపలకూర" అంటూ మావోడినికూడా తిన్నియ్యా లేదండి. సత్తి, మావోడుకూడా కూర తినకపోతే నా కన్నులు కరిగిపోయి నీళ్లు కారిపోనాయండి, నాగుండెలు మరిగిపోనాయండి, అది సూత్తాండగా నన్నుకూడా తినొద్దన్నాదండి, ఆరేతిరి మావోడు, సత్తి పకపకా నవ్వు లాడుకొంటూ, ఊసులాడుకొంటూ, మా కులాసాగా సక్కగా ఎన్నెట్లో కూకున్నారండి.

పొద్దున్నే మావోడు చద్దికూడు తింటూండగానే సత్తి కూడా ఆడితో వత్తానని పెయాణమైందండి, నేనూ మా వోడు కలిపి ఎల్లకుండా ఆపేశామండి.

అయ్యాల ఆరి సేగితులువచ్చి నన్ను తొందరగా రమన్నారండి, సరేనని ఎల్లిపోనానండి. నేను ఎల్లంగానే నాయుడుగోరి అబ్బాయివచ్చి ఒంటిగా కూకున్న మా సత్తిని సూసి ఇంటోకి రాబోనాడండి. మా సత్తి గువ్వపచ్చిలా ఒణికిపోనాదండి. ధయిరెము తెచ్చుకోని గభాలున తలుపేసుకున్నాదండి. నాయుడుగోరబ్బాయి తలుపుతోసేస్కోని లోపలపడదామనుకుంటే గడేసిందండి. ఆరు ఆ గుమ్మందగ్గరే నిలబడి లంచమిత్తానని. రయికలిత్తామనీ, సీరలిత్తాననీ, నీకేంకావాలన్నా ఇత్తాననీ, పాణాన్నికూడా ఇమ్మన్నా ఇత్తాననీ ఎన్నో అన్నాడంటండి ఎన్ని కూసుకున్నా సత్తిమాత్తరం తలుపు తియ్యకుండా లోన కూసుందండి. ఆకరుకి మావోడు వచ్చేఏలకి నేను వచ్చానుండి, ఆరూ ఎల్లిపోనారుండి.

ఆ రాతిరి సత్తీ మావోడు అన్నాలు తింటోంటే "నేనోపాలిమన ఊరెల్లివత్తా. నాకు అక్కడోళ్లని సూడాలనుంది. కూడికూతేళ లెగిసి ఎడుతున్నా" అని సెప్పినానండి. మావోడు, సత్తి ఎల్లొద్దన్నా ఇనకుండా నాయుడుగోరబ్బాయిగారిచ్చిన పాతిక రూపాయలు పట్టుకుని ఇక్కడికి వచ్చేసినానండి.

నేను ఒచ్చేసాక సత్తీ మావోడు ఒక్కచ్ఛణంకూడా ఒదిలిపెట్టకుండా ఇద్దరూ కల్సి పొద్దున్నే చద్దికూడు తిని

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.

మల్లా మద్దేన్నానికి ఒన్నంకూడా పట్టుకెల్లి మాపుటికి ఇంటికొచ్చేప్పుడే రోజూ ఏదో కూరలు తెచ్చుకొనేవారం టండి, మావోడికి ఏడాది జీతమేనండి. సత్తిమాత్తరం సందాలకి రోజు కూలి తెచ్చుకొనేదండి. నాకు మాఓడికి చాపల కూరలంటే మాఇట్టం. సత్తి ఎంత కరీదైనా సరే మావోడి కోసం రోజూ ఏదోకొంటూనే వుండేదటండి. నప్పిడి పరిగిలు ఒక్కొక్కటి ముప్పావల అయిన తెచ్చేందట. రూపాయపెట్టి గుడ్డాకురాయిలు కోనేదంట. అద్దు రూపాయి అయినా మట్టగిడసలు తెచ్చేందట, కొర్రమేన్లు రూపాయి ఇచ్చికొనిందట. రూపాయిపెట్టి వాలుగులు. తెచ్చేందట, జెల్లెల్లు, మార్పులు, బొచ్చపరిగలు, గుడ్డు పీతలు, చొర మోచుపరిగలు ఒక్కొక్కటి ఆరణాలైనా తెచ్చేదంటండి. మావోడు కట్ట పరిగిలు, బొమ్మిడాయిలు, రావలు, ఏట్లు మదుళ్లు చెమ్మేయ్‌పావులు, ఎండ్రసీతలు, గాజురెయ్యిలు, పచ్చిరెయ్యిలు, చేదు పరిగిలు, కట్టపరిగిలు ఇంకా....ఇంకా అన్నీ తెచ్చే వోడంట. సందాల ఇద్దరూ కమ్మగా ఒండుకు తింటూ మాసుకంగా శానా రోజులు వుండి పోనారండి.

అయ్యాల ఏడాదికోసారి దీపావళీ ముందుపడాది. అందరూ ఆనందగా కొనుక్కొంటున్నారని శేరు ముప్పావలా ఇచ్చి సేర్మేన్ చాపలు కొనుక్కొంటూంటే నాయుడుగోరబ్బాయి. సూసినాడటండి మావోణ్ణి సత్తిని. "మీకు కావలంటే నేనే కొనిపంపించే వోణ్ణి. ఇంతకట్ట పడి సత్తి రోజుకూలి సేసిన సొమ్ము చాపలకెందుకు పాడు సేత్తారు?" అన్నాడటండి. మావోడు గవురవంగా ఏదో సెప్పేశాడంట కానండి. సత్తిమాత్తరం శానా అసయ్యించు కొన్నాదంట.

ఆ రేతిరి బాగాముత్తాబై మావోడు సత్తి సినిమా సూద్దానికి ఎల్లాలనుకొని ఒన్నం, కూర వొండుకొని ఇద్దరూ కూచుని వూసులాడు కొంటూంటోంటే నాయుడు గోరబ్బాయి ఒచ్చాడంటండి.

"ఏవర్రా! ఇయ్యాల మా జలిసీగా వున్నారేంటిద్దరూ" అన్నారటండి.

"రాతిరి సినీమా కెడతామండి" అన్నాడంటండి మావోడు.

"ఇదిగో నర్రా మీకోసం "పులావు" తెప్పించా తినండి" అనిసెప్పి ఓపెద్ద ఆకులో పొట్లం కట్టి తెచ్చింది ఇవ్వబోనాడటండి.

"నీసేత్తో ఇచ్చింది అశుద్దంతో సమాన కుక్కలకీ పందులకీ పెట్టుకో, మణుసులైన వాళ్లెవరూ పుచ్చుకోరు. నీ మొఖం సూస్తే అన్నంకూడా ముట్టుకో బుద్ధికాదు. పాపిట్టోడా" అనేసిందటండి సత్తి అరిని. "తప్పుసత్తీ. అద్దు మీరి మితిలేకుండ మాట్టాడేతున్నావు. ఆయన గొప్పోరు. మనం తక్కువోళ్లం" అన్నాడటండి మావోడు.

"ఏమిటిమావా! కులంలోనూ, ధనంలోనూ గొప్పోరయితే గుణంలో తక్కువోరేలే! పరాయి ఆడోళ్లకోసం ఎంటపడి తిరిగేతుంటరోడు. ఆవుల ఎనకాలపరుగెత్తే ఆంబోతు లాంటోడు. లేడిని తరుముకెల్లే కొండచిలువ లాటోడో. కోడిపెట్టకోసం కాసుక్కూసున్నా నక్కబోతులాంటోడు. కొబ్బరిసిప్పలా మొఖం ఈడూనూ, మొఖంమీద వుమ్మూసినా సిగ్గులేని దొమ్మరి సన్యాసివోడు. మనకొద్దు ఎదవ పులావు.పట్టుకుపోయి గోదావర్లో పారేసుకోమను. దెయ్యం పట్టినోడిలా ఎప్పుడూ ఈతోటలోనే తిరుగుతుంటాడు. ఈడు మేకల కోసం తిరిగే యాగ్రంలాంటోడు మావా!" అంటూ సత్తి అరిని ఎన్నోదురు బాసలాడి మా ఓడిని చెయ్యట్టుకుని ఇంటోకి తీసుకెల్లిపోయి తలుపు ఏసేసినాదండి. అరిసేగితుడు వచ్చి "ఈసత్తి మామూలుగా లొంగదురా, మాగెట్టి మణుసు. దీన్ని నువ్వు లొంగదీసుకోవాలంటే దానిమొగుణ్ణి కూడాతో వెయ్యాలి. అప్పుడు సత్తిని రచ్చించే వాడెవడూ లేకపోతే, నీకాళ్లకి దణ్ణం పెడుతూ నీ కోరిక తీరుత్తాదిరా" అంటూ ఆ సేహితుడు సలహా ఇచ్చాడంటండి. ఆరేత్తిరంతా సత్తీమావోడు మల్లీతలుపుతీసి బయటకి రాకుండా హాయిగా నిద్దరోయారంటా. నాయుడుగోరబ్బాయి మాత్తరం ఒల్లు దయించుకుపోయే మోహంతో కంటికి కునుకులేకుండా గోనే బత్తా లాగా అక్కడే కూకుండి పోనాడంట తెల్లవారిందాక.

ఆ పొద్దున్నే సత్తి మావోడు పొలం ఎల్లడానికి సిద్దంగా వుండంగా నాయుడుగోరబ్బాయి వచ్చిమావోణ్ణి

పిలిసి ''నిన్ను నాయుడుగోరు వూరికి ఎల్లమన్నారు. దబ్బున బయలుదేరు'' అన్నాడుటండి. అదేదో కనుకుం దామని సత్తి మావోడు కలిసి నాయుడుగారి దగ్గరకి ఎల్లి అడిగి నారంటండి. అన్నెం పున్నం ఎరగని ఆ ధరమ ఫెభువు ''అవును. అబ్బాయికి పనుందట ఎల్లిరా'' అన్నారటండి.

లోపల కూకో బెట్టుకుని సత్తి మావోడికి శానాశానా సెప్పిందటండి. అన్నీ ఇన్నాక అల్లాగే సేత్తాలే సత్తీ అన్నాడటండి మావోడు.

మావోడు ఊరికి ఎల్లిపోనాడని తెలవంగానే నాయుడుగోరబ్బాయి, ఆరి సేగితులు వచ్చారంటండి. వచ్చీరాంగానే సత్తిని సిరకొంగట్టు కొన్నాడటండి. ''బాబుగోరూ! తమరు కొపోరు; అల్లాలోపల గదికి రాండి'' అంటూ సల్లగా సెప్పిందట సత్తి.

యికారంతో కళ్లుమూసుకుపోయి ఒల్లుతెలవకుండా లోపలికొచ్చి కూసున్నారంట నాయుడుగోరబ్బాయి. సత్తి తలుపు బయట గొల్లెంపెట్టి, సుట్టూ తలుపులన్నీ గొల్లాలెట్టి లోపల వుంచిందట ఆరిని. అంతవరకూ సెట్టు ఎనకాల కాసుకూకున్నా మావోడికి వెయ్యి ఏనుగుల బలమొచ్చి, ఆరిసేగితులందరిని తరిమితరిమి, సచ్చేలా, గిజగిజ తన్నుకు మూరస పోయిలా కొట్టేసి నాడటండి. అందర్నీ పొలం కాడ సాలలోకి ఈడుసుకెల్లి లోపల పారేసి బయట తలుపులు ఏసేసినాడంటండి. ఆ దురమారగపు జట్టుసేగితులందరూ సేపుకట్టల్లాలోపల పడున్నారటండి.

పొలంలో పనిసేసే వోల్లందర్నీ ఎంట బెట్టుకుని మాసత్తీ, నాయడుగోర్ని తీసుకుని మావోడు తోటలోకి వచ్చినారటండి. మొట్ట మొదటినుంచీ జరిగిందంతా చెప్పినాదంటండి సత్తి. ఎంతో సెప్పినా నాయుడు గోరు నమ్మలేదంటండి. అప్పుడు తలుపుతీసి లోపలకూరుసున్నా కొడుకుని సూసేసరికి నిలువునాసచ్చి పోయారటండి నాయుడుగోరు.

ఆరిసేహితులున్నా సోటుకూడా సూపించేసరికి తనకొడుకు దురన్నాయన్నీ, దుండగీడు పనులని కళ్లారా సూసాక మళ్లీనోరెత్తలేక పోనారంటండి ఆ మహాఫెభువు నాయుడుగోరు. అక్కడున్నావోరంతాతు బుక్కున ఉమ్మేసేరంటా తులసివనంలో గంజాయి మొక్కలాంటి ఆ చండాలడునిచూచి, తనతప్పంతా ఒప్పేసుకున్నాడంటండి నాయుడుగోరి అబ్బాయి.

''సత్తీ నన్ను చ్చమించు, నాకొడుకింత దురంతపని తలపెట్టేడని కల్లోకూడా అనుకోలేదు. ఇల్లాంటి దురమారగపు కొడుకు సచ్చినా బతికినా ఒకటే. ఇల్లాంటోడు భూమ్మీదుండడం బూదేవికి బారం'' అంటూ కొడుకుని సంపేత్తానని గునపం పట్టుకు ఎల్లారంటండి నాయుడుగోరు.

''ఒద్దుబాబూ! తమరికి ఆరొక్కరే కొమారుడు. మేమే ఎల్లిపోతాం ఇక్కడనుంచి'' అన్నాడంటండి మావోడు.

నాయుడుగోరు కొడుకుని ఆరిసేగితుల్ని సెడామడా తిట్టేసి, మావోణ్ణి సత్తిని ఎంటబెట్టుకుని తీసుకొచ్చి ఈ ఊళ్లో ఆరికి రెండెకరాల పొలం వుంది కదండీ ఆ సేను మీద ఆదాయం సరిగ్గా ఇవ్వడంలేదని అది అమ్మేసుకోవాలని అనుకొనే వోరంట, ఆపొలం అంతా సత్తికీ మావోడికి ధరమంగా, డబ్బుచ్చుకోకుండా రాసి, సబురిజిట్రారు దగ్గరకి తీసుకెల్లి ఇరవై బత్తాలు ధాన్యంగింజలు వచ్చే రెండెకరాల భూమి దానపట్టారాసి, రిజిట్టరీ చేయించి ఇచ్చేసారండి ''మీ లాంటి ఉత్తములు, నీతిగలోళ్లకి ఈ భూమి ఇవ్వడం సేతనా జల్మతరించింది. హాయిగాబతికి సుకంగా పిల్లలతో వెయ్యేళ్లు వర్దిల్లండి'' అని సంతోసంగాసెప్పి ''ఇల్లుకూడా పెంకుటిది ఏసుకోండి, అందుకు డబ్బంతా నేనిత్తా. కామేసిరమ్మగోరి రైతుని నా దగ్గరికి పంపండి'' అన్నారండి. ''సత్తీ! కులం, సదువు ధనం లేకపోయినా, భూదేవికి రతనంలాంటి రైతుకూతురువు ''అంటూ సత్తి తండిరి దగ్గరా, సత్తితోనూ ఉప్పొంగిపోతూ సెప్పి ఎల్లారండి నాయుడుగోరు ''అని సెప్పింది నరసమ్మ-

తనరైతుకూతురు సత్తి సౌశీల్యాన్ని విని అనందంతో పరవశించడమే కాకుండా గర్వించించింది కామేశ్వరమ్మ,